సాక్షి నంద్యాల

సోమవారం । 27 । నవంబర్ । 2023



లక్ష దీపోత్సవ కాంతుల మధ్య శ్రీశైల పుష్కరిణి

న్యూస్‌రీల్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

నంద్యాల: రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత అని డీఆర్‌ఓ పుల్లయ్య పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కాంక్షించి రచించిన రాజ్యాంగాన్ని 1949వ సంవత్సరం నవంబర్ 26న బాబాసాహెబ్ జాతికి అంకితం చేశారన్నారు. ఇదే రోజును జాతీయ న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవాలను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. త్యాగం, కృషి, పట్టుదల, నిజాయితీ, నిబద్ధత, చిత్తశుద్ధి, క్రమశిక్షణకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు నిదర్శనం అన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి భారత రాజ్యాంగ ప్రస్తావన చదివి వినిపిస్తూ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు స్పందన రద్దు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశారు.అయితే సబ్‌డివిజన్ పరిధిలోని డీఎస్పీ, సీఐ కార్యాలయాల్లో యథావిధిగా ఈ కార్యక్రమం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

గుడిపాడులో చిరుత సంచారం

ప్యాపిలి: మండల పరిధిలోని గుడిపాడు శివారు ప్రాంతాల్లో గత రెండు వారాలుగా చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఓ అరటి తోటలో రెండు కుక్కల కళేబరాలు కనిపించాయి. చిరుత పులే వాటిని చంపినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో కూడా గుడిపాడు పరిసర పొలాల్లో చిరుత కనిపించింది. మళ్లీ ఇప్పుడు దాని ఆనవాళ్లు కనిపించడంతో గుడిపాడు గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు చిరుత బారి నుంచి తమను కాపాడాలని వారు కోరుతున్నారు.

రాయలసీమ దంత వైద్యుల సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమ దంత వైద్యుల సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో నిర్వహించారు. సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా డాక్టర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ నరేష్‌గౌడ్, ఎలెక్టెడ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కిశోర్ (నంద్యాల)తో పాటు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, డాక్టర్ పి. సునీల్ కుమార్‌రెడ్డి, డాక్టర్ నాగలక్ష్మిరెడ్డి రాష్ట్ర ప్రతినిధులుగా ఎన్నికయ్యారు.

రుధిర గుండాన్ని పునరుద్ధరించండి



రుధిర గుండాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో భ్రమరాంబాదేవి ఆలయ ప్రాంగాణంలోని రుధిర గుండానికి తగు మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఆదివారం శ్రీశైలం చేరుకున్న కమిషనర్ క్షేత్ర పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల చెరువు పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు తగు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పంచమఠాల ప్రాంగణాల చుట్టు పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అంతకు ముందు ఆయన ఆలయ ప్రాంగణంలోని ప్రాచీన కట్టడాలు, పశ్చిమ, ఉత్తర మాఢవీధులు, ఏనుగుల చెరువుకట్ట, పుష్కరిణి, ఘంటామఠం, రుద్రాక్షమఠం, విభూతిమఠాలను పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, రాష్ట్ర దేవదాయశాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప, సహాయ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హర హర..మహాదేవ!

- శ్రీగిరిలో వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- నేత్రానందభరితంగా జ్వాలాతోరణోత్సవం, పుష్కరిణి హారతి



కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైలంలో శివనామస్మరణ మార్మోగింది. ఆదివారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు శ్రీగిరికి తరలివచ్చారు. వారు వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలచరించి ఆలయం ఎదురుగా గంగాధర మండపం, ఉత్తర మాఢవీధిలో కార్తీక దీపాలను వెలిగించి, ప్రత్యేక నోములు, పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా భక్తులందరికీ స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధికారులు గర్భాలయ, సామూహిక అభిషేకాలు, స్పర్శదర్శనాన్ని నిలుపుదల చేశారు.

నేత్రానందభరితం..జ్వాలాతోరణోత్సవం

దేవస్థానం ఆధ్వర్యంలో జ్వాలాతోరణోత్సవం ఆద్యంతం నేత్రానందభరితంగా సాగింది. అర్చకులు, వేద పండితులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో గంగాధర మండపం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజాదిహారతులిచ్చారు. అనంతరం టూరిజం శాఖ మంత్రి ఆర్‌కే రోజా, శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇతర ప్రముఖులు నూలు వత్తులను వెలిగించారు. ఇది తోరణంగా వెలిగింది. చివరగా జ్వాలాతోరణోత్సవంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా విశేష పూజాదికాలను నిర్వహించి జ్వాలాతోరణం చుట్టు మూడుసార్లు స్వామిఅమ్మవార్ల పల్లకీని తిప్పారు. ఈ కార్యక్రమాన్ని వేలాది మంది భక్తులు తిలకించి పునీతులయ్యారు. తర్వాత పాతాళగంగ వద్ద గల కృష్ణవేణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి నదీమాతల్లికి ఏకాదశ(పదకొండు) హారతులు ఇచ్చారు.



జ్వాలాతోరణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

దేదీప్యమానంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతులు

కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణికి హారతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. లక్షదీపోత్సవ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద ఆశీనులు గావించి అర్చకులు, వేదపండితులు విశేష పూజాదికాలు నిర్వహించారు. అనంతరం పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. స్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులైన ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్ర హారతి, కర్పూర హారతిలను ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజాదికాలను చేపట్టి హారతులిచ్చారు.

భూమా X ఫరూక్!

- నంద్యాల టీడీపీలో లొల్లి
- టికెట్ ఫరూక్‌కే అని భూమా బ్రహ్మానందరెడ్డి మొహం మీదే చెప్పేసిన చంద్రబాబు
- ఈ నేపథ్యంలో నంద్యాలలో అనుచరులతో భూమా సమావేశం
- ఫరూక్‌కు సహకరించొద్దని బహిరంగంగానే పిలుపు
- 15 రోజుల్లో అధిష్టానం దిగిరాకపోతే రెబల్‌గా పోటీ చేస్తానని వెల్లడి
- తనతో కలిసి రాకపోతే పదవులు ఉండవని నాయకులకు ఫరూక్ హెచ్చరిక



భూమా బ్రహ్మానందరెడ్డి



ఎన్‌ఎండీ ఫరూక్

నంద్యాల: ఎన్నికలకు నాలుగైదు నెలలు సమయం ఉండగానే తెలుగుదేశం పార్టీలో టికెట్ల లొల్లి మొదలైంది. నంద్యాలలో ఈ పరిస్థితి తారాస్థాయికి చేరింది. రానున్న ఎన్నికల్లో నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జ్ భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ బరిలో దిగేందుకు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరిని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల హైదరాబాద్‌లోని తన ఇంటికి పిలిపించుకుని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఫరూక్‌కు టికెట్ ఇస్తున్నామని, సహకరించాలని భూమా బ్రహ్మానందరెడ్డికి చంద్రబాబు చెప్పారు. మొహం మీదే ఈ విషయం చెప్పేయడంతో భూమా వర్గీయులు టీడీపీ అధినేతపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో భూమా బ్రహ్మానందరెడ్డి తన నివాసంలో అనుచరులు, పార్టీ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు.

నాకు అన్యాయం జరుగుతుందని అనుకోలేదు

మాజీ మంత్రి ఫరూక్‌కు టికెట్ ఇస్తున్నాం.. నువ్వే గెలిపించాలి. నీకు మొదటి విడతలోనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి న్యాయం చేస్తా అని చంద్రబాబు హైదరాబాద్‌లో తనతో చెప్పారని, దీన్ని ఎలా నమ్మాలని కార్యకర్తలతో భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. నారా లోకేష్ పాదయాత్ర సమయంలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలకు భారీగా ఖర్చు చేసుకున్నానని, నాలుగున్నరేళ్లు పార్టీ నాయకులకు అండగా నిలిచానని, తనకే టికెట్ ఇవ్వాలని చెప్పినా వినిపించుకోలేదని సమావేశంలో భూమా ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. నంద్యాలలో పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన తనకే పార్టీ అధినేత అన్యాయం చేస్తారని అనుకోలేదని కార్యకర్తలతో వాపోయారు.

ఫరూక్‌కు సహకరించొద్దు.. రెబల్‌గా పోటీ చేద్దాం

మాజీ మంత్రి ఫరూక్‌కు ఎవరు సహకరించవద్దు.. 15రోజులు చూసి అప్పటికీ చంద్రబాబు దిగిరాకపోతే వచ్చే ఎన్నికల్లో రెబల్‌గా పోటీ చేద్దామని అనుచరులకు భూమా స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా దానికి పోటీగా మనం కార్యక్రమం నిర్వహిద్దాం. ఎవరి సత్తా ఏమిటో బాబుకు తెలిసేలా చేద్దాం. ఇందుకు తనకు అందరు సహకరించాలని కార్యకర్తలకు సూచించారు.

భూమాపై మాజీ మంత్రి గుస్సా!

ఫరూక్‌కు టికెట్ ఇస్తే గెలవడని, ఆయనకు సహకరించే ప్రసక్తే లేదని చంద్రబాబుకు భూమా బ్రహ్మం తెలియజేయడంతో ఫరూక్ వర్గీయులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే భూమా బ్రహ్మానందరెడ్డి నిర్వహించే కార్యక్రమాలకు ఎవరూ వెళ్లవద్దని, తనకే టికెట్ ఓకే అయ్యిందని అందరూ తనవెంటే రావాలని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి ఫోన్లు చేసి చెబుతున్నారు. ఆదివారం భూమా నిర్వహించిన సమావేశానికి సైతం ఎవరూ వెళ్లొద్దని నాయకులకు ఆయన ఫోన్లు చేశారు. టీడీపీలో ఉండాలంటే తనతో ఉండాలని లేకపోతే పార్టీ పదవులు ఉండవని వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భూమా, ఫరూక్ మధ్య నెలకొన్న విభేదాలు ఏ స్థాయికి చేరుకుంటాయోనని ఎవరి వైపు వెళ్లాలో అర్థం కాక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

సంక్షేమ బావుటా



అందుకే మళ్లీ జగనే రావాలి

జగన్ సీఎం అయ్యాకా మాకు సంతృప్తికరమైన సంక్షేమ పథకాలు వచ్చాయి. ముఖ్యంగా నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 వస్తుంది. ఇలా ఇప్పటికే మూడేళ్లు తీసుకున్నాను. ప్రస్తుతం నాల్గో విడతలో కూడా నాపేరు లబ్ధిదారుల జాబితాలో ఉంది. ఇంతకంటే ఏం కావాలి. నాకు చేయూత పథకం ద్వారా రూ.70 వేలు వచ్చినట్లే. ఆ డబ్బుతో చిన్న కిరాణం పెట్టుకోని జీవనం సాగిస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వం మమ్మల్ని ఇలా ఆదుకోలేదు. అలాగే నా భర్త సత్యంకు కూడా రూ.2750 వృద్ధాప్య పింఛన్ ప్రతి నెలా ఇస్తున్నారు. కొత్త సంవత్సరం నుంచి రూ.3 వేలు ఇస్తారని చెబుతున్నారు. అలాగే మాకు రైతు భరోసా కూడా ప్రతి ఏటా రూ.13,500 వస్తుంది. ఇంత కంటే ఏం కావాలి మాలాంటి పేదలకు. అందుకే మళ్లీ జగనే సీఎం కావాలి కోరుకుంటున్నాం.

– ఓర్వకంటి రత్నమ్మ, డబ్ల్యూ గోవిందిన్నె, డోర్నిపాడు మండలం



ఆరోగ్య శ్రీ లేక పోతే అప్పల పాలే

మాది చాలా పేద కుటుంబం. సెంటు భూమి లేదు. రెక్కల కష్టం మీదనే బతుకుతున్నాం. ఇద్దరు పిల్లలు ఉన్నారు. నా భార్య కూడా ప్రతి రోజు కూలి పనికి వెళ్తుంది. ఈ ఏడాది అక్టోబర్ నెలలో నాకు గుండెపోటు వచ్చింది. నందికొట్కూరు, కర్నూలులో చూపించుకున్నాను. నొప్పి భరించలేక నడవడానికి కూడా ఇబ్బంది పడ్డాను.



కర్నూలువిశ్వభారతి హాస్పిటల్‌లో చూపించుకున్నాను. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా యాంజియోగ్రామ్ చేశారు. రక్త నాళాలు పూడిపోయాయని గుర్తించి స్టంట్ వేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా చేయడం వల్ల నాకు ఖర్చేమి కాలేదు. హాస్పిటల్‌లో 3 నెలల మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ లేకపోతే కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక అప్పులపాలు అవ్వాల్సిందే. మా రెండవ అబ్బాయి కిరణ్ 10వ తరగతి చదువుచున్నాడు. అమ్మ ఒడి పథకం డబ్బులు నా భార్య లలితమ్మ బ్యాంకు అకౌంట్‌లో పడ్డాయి. పావలా వడ్డీ కూడా వర్తించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నా కుటుంబం అంతా రుణపడి ఉంది. పేదల పాలిట పెన్నిధిలా అందరిని ఆదుకుంటున్నారు ఆ మహానుబావుడు వైఎస్ జగన్.

– సుగదాసు ఏసేపు, తుమ్మలూరు, పాములపాడు మండలం

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్‌తో కలిసి అవుకు టన్నెల్ పరిసర ప్రాంతాల పరిశీలన



హెలిప్యాడ్ ప్రదేశంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న మంత్రి బుగ్గన, చిత్రంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

అవుకు: అవుకు రెండవ టన్నెల్‌ను జాతికి అంకితం చేసేందుకు ఈనెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మెట్టుపల్లె గ్రామ సమీపంలో జరుగుతున్న పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్ రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. టన్నెల్ సమీపంలో ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించి, లోతట్టు ప్రాంతం వైపు ప్రజలు వెళ్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆ రోజు రెండు టన్నెళ్ల ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారన్నారు. తర్వాత టన్నెల్‌కు 600 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం పర్యటన విజయవంతానికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ సంపత్, ఇరిగేషన్ ఎస్ఈ చెంగయ్య, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రిపై స్క్రూడ్రైవర్‌తో కొడుకు దాడి

బొమ్మలసత్రం: కన్న తండ్రిపై కొడుకు స్క్రూడ్రైవర్‌తో దాడి చేశారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి నంద్యాల పట్టణంలోని స్థానిక వీసీ కాలనీలో చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కూలీ పని చేసుకుంటూ జీవించే శివకు చంటి అనే కుమారుడు ఉన్నాడు. అతను మద్యానికి బానిస కావటంతో తండ్రి మందలించాడు. ఇందుకు ఆగ్రహించిన చంటి తండ్రిపై స్క్రూడ్రైవర్‌తో దాడి చేశాడు. రక్తగాయాలైన శివను భార్య స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'వరి'ంచిన దిగుబడులు

- కలిసొచ్చిన ఖరీఫ్ వరి సాగు
- ఎకరాకు 40 బస్తాల దిగుబడి
- ఎకరాకు రూ. 25 వేల పెట్టుబడి
- క్వింటాకు రూ. 2,203 మద్దతు ధర
- వడివడిగా వరి కోతలు, నూర్పిడి పనులు



భీమునిపాడు వద్ద కంబైండ్ హార్వెస్టర్‌తో వరి కోత పనులు



కోవెలకుంట్ల సమీపంలో రాశిగా పోసిన వడ్లు

కోవెలకుంట్ల/డోన్ రూరల్: వరి రైతులకు ఈ ఏడాది అన్ని విధాలా కలిసొచ్చింది. దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తోంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కుందూనది, పాలేరు, కుందరవాగు, కేసీకెనాల్, తదితర సాగునీటి వనరుల ఆధారంగా ఖరీఫ్ సీజన్‌లో 1.03 లక్షల ఎకరాల్లో కర్నూలు, నంద్యాల సోనా, 555 రకాలకు చెందిన వరిని రైతులు సాగు చేశారు. బండిఆత్మకూరు మండలంలో అత్యధికంగా 25,000 ఎకరాలు, నందికొట్కూరు మండలంలో అత్యల్పంగా 132.5 ఎకరాల్లో సాగు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను వ్యవసాయశాఖ సరఫరా చేసింది. క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి సాగులో రైతాంగానికి వ్యవసాయ శాఖ దిశానిర్దేశం చేసింది. ప్రస్తుతం వరికోత, నూర్పిడి పనుల్లో రైతుల్లో నిమగ్నమయ్యారు.

దిగుబడులు ఆశాజనకం

గత ఏడాది ఖరీఫ్‌లో వరిసాగులో మంచి దిగుబడులు వచ్చాయి. వాతావరణం అనుకూలించి ఎకరాకు 40 నుంచి 42 బస్తాల దిగుబడులు లభించాయి. ఈ ఏడాది కోటి ఆశలతో వరి సాగు చేయగా ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరినారు, నాట్లు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు, కోత, నూర్పిడి, తదతర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు వెచ్చించారు. పైరు వివిధ దశల్లో దోమ, ఎర్ర తెగులు ఆశించగా రైతులు సకాలంలో గుర్తించి క్రిమి సంహారక మందుల పిచికారీతో తెగుళ్లు అదుపులోకి వచ్చాయి. వాతావరణం అనుకూలంగా మారి పంట పండి ఎకరాకు 40 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. పెట్టుబడులు పోనూ నికర ఆదాయం చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్వింటాకు రూ. 2,203 మద్దతు ధర

ఈ ఏడాది వరిసాగుకు ముందే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గ్రేడ్-1 రకం క్వింటా 2,203, గ్రేడ్-2 రకం రూ. 2,183 ధర నిర్ణయించారు. వరికి మద్దతు ధర ఉండటంతో రైతులు విస్తారంగాసాగు చేశారు. వరిపైరు చేతికందటంతో రైతులు కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కంబైండ్ హార్వెస్టర్ యంత్రాలతో వరి కోత. నూర్పిడి పనులు జరుగుతున్నాయి. ఎకరా వరి కోత, నూర్పిడికి రూ. 3వేలు ఖర్చు అవుతోంది. మార్కెట్‌లో ధర ఉండటంతో నూర్పిడి చేసిన వెంటనే వడ్లను విక్రయిస్తున్నారు. పచ్చివడ్లను బస్తా (75 కేజీలు) రూ. 1,500లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడులు ఆశాజనకంగా వస్తుండటం, ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర ఉండటంతో ఆదాయం చేకూరుతుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పంట బాగా పండింది



నాకున్న 2.07 ఎకరాల్లో ఈ ఏడాది కర్నూలు సోనా రకం వరిని సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేలు వెచ్చించాను. వాతావరణం అనుకూలించి పైరు ఏపుగా పెరిగింది. పంట బాగా పండింది. ఎకరాకు 40 బస్తాల దిగుబడులు వస్తాయని భావిస్తున్నాను.

– బలరాముడు, రైతు, అమదాల, కోవెలకుంట్ల మండలం

మార్కెట్‌లో మంచి ధర ఉంది



ఈ ఏడాది వరి సాగు ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. మార్కెట్‌లో వరికి గిట్టుబాటు ధర ఉంది. పెట్టుబడి పోను రైతుకు నికరాదాయం లభిస్తోంది.

– చిరంజీవి, దొరపల్లి గ్రామం

వాతావరణం అనుకూలించింది

ఈ ఏడాది వరి సాగుకు వాతావరణం అన్ని విధాలా అనుకూలంగా మారింది. పైరు రెండు నెలల దశలో దోమ పోటు, ఎర్ర తెగులు ఆశించగా రైతులకు సూచనలు, సలహాలు అందజేశాం. ఎకరాకు 40 బస్తాల దిగుబడులు వస్తున్నాయి.

– టి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మలసత్రం: మహానంది మండలం అంకిరెడ్డి పల్లి చెరువు గట్టుపై పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రూ.8,32,100 స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ చంద్రబాబునాయుడు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. మొత్తం 16 మందిలో 10 మంది అక్కడి నుంచి పరారు కాగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 8, 32, 100 నగదు, 5 సెల్‌ఫోన్‌లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. దాడుల్లో మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు టైలర్ గోవిందరెడ్డికి రిమాండ్

డోన్ టౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు అయిన టీడీపీ నాయకుడు టైలర్ గోవిందరెడ్డికి డోన్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. నిందితుడు టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు ఇప్పిస్తానని పలువురి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారు. తర్వాత అతనే ఇళ్ల పంపిణీ జరగకుండా కోర్టులో కేసు వేశారు. దీనిపై ప్రశ్నించేందుకు ఇటీవల ఇంటికి వెళ్లిన టైలర్ల సంఘం సభ్యులు, మహిళలపై దౌర్జన్యం చేయడంతో పాటు కులం పేరుతో దూషించాడు. ఈ ఘటనపై టైలర్ల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ, చీటింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం గోవిందరెడ్డిని అరెస్టు చేసి జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బైకులు ఢీ.. ఒకరు మృతి

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికిగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన బోయ రామనాయుడు (40) తన సమీప బంధువు రామకృష్ణతో కలిసి వ్యక్తిగత పనిమీద బైకుపై డోన్‌కు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై తాడూరుకు చెందిన శంకరయ్య బైకు వెనుక నుంచి వచ్చి ఢీకొంది. క్షతగాత్రులను వెంటనే డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా రామనాయుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకరయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా మృతుడి కుటుంబసభ్యుల వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి దారుణ హత్య

మద్దికెర: నంచర్ల రైల్వే లైను వద్ద ఉన్న పొలాల్లో చిప్పగిరి మండలం నంచర్ల గ్రామానికి చెందిన బోయ గోపాల్ (55) అనే వ్యక్తిని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల మేరకు.. రోజు మాదిరిగానే బోయ గోపాల్ ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం అయినా రాకపోవడంతోపాటు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. పొలం పక్కన పడి ఉన్న స్కూటర్‌ను, మృతదేహాన్ని రైల్వే గేట్‌మ్యాన్ గుర్తించి నంచర్ల గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామమస్తులు వచ్చి మృతదేహం బోయగోపాల్‌గా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్దికెర ఎస్‌ఐ రిజ్వాన్ మహమ్మద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ముఖంపై రాళ్లతో కొట్టి బోయగోపాల్‌ను హతమార్చినట్లు గుర్తించారు. హత్య చేయడానికి కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాని ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య ఎర్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



కర్నూలు: జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన తదితరులు



బనగానపల్లె రూరల్: యాగంటి అఖండ దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని



బేతంచెర్ల: జ్వాలా తోరణాలను వెలిగిస్తున్న భక్తులు

శివోహం

శివాలయాల్లో ప్రణవనాదం ప్రతిధ్వనించింది.. నదుల్లో, కాలువల్లో దీప కాంతులు శోభిల్లాయి.. కార్తీక పౌర్ణమి వేడుకలు ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైభవంగా జరిగాయి. పలు చోట్ల శివపార్వతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గంగమ్మకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. జ్వాలాతోరణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. అఖండ దీపోత్సవాలు, లక్షదీపోత్సవాలతో ప్రముఖ దేవాలయాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వేడుకలకు హాజరయ్యారు. కార్తీక పౌర్ణమిని విశిష్టతను ప్రముఖులు వివరించారు.

–సాక్షినెట్‌వర్క్



శ్రీశైలం: కృష్ణమ్మకు నదీహారతి ఇస్తున్న అర్చకులు



శ్రీశైలం: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే శిల్పా



కర్నూలు: దేవనగర్ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మహానంది: కోటి దీపోత్సవానికి హాజరైన భక్తులు



కర్నూలు: కార్తీక పూజలో యువతి



కర్నూలు: వినాయక ఘాట్‌లో నృత్య ప్రదర్శన



నంద్యాల: శివ గణాల వేషధారణలో నృత్య ప్రదర్శన



కృష్ణగిరి: తాపలకొత్తూరులో లింగాకారంలో వెలిగించిన దీపాలు



జూపాడుబంగ్లా: తాటిపాడు గ్రామంలో..

రెచ్చిపోయిన దొంగలు

● కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల చోరీలు

కోడుమూరు/ఆదోనిఅర్బన్/ఆలూరు రూరల్: కర్నూలు జిల్లాలో దొంగలు రెచ్చిపోయారు. వేర్వేరు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. కోడుమూరులోని మహాలక్ష్మి కాలనీలో నివాసముంటున్న లావణ్య అనే మహిళ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చొరబడి 20తులాల బంగారు, 2కిలోల వెండితో పాటు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. కుమార్తెను అత్తారింట్లో దిగబెట్టేందుకు ఇంటికి తాళం వేసి నందికొట్కూరు వెళ్లగా.. ఇదే అదనుగా భావించిదొంగలు చోరీకి పాల్పడ్డారు. కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలు వెళుతున్న దృశ్యాలను పరిశీలించారు.

ఆదోని పట్టణంలో..

పాత ఓవర్ బ్రిడ్జి కింద క్రాంతినగర్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటి యజమాని గర్జప్ప, మంజుల దంపతులు ఇస్వీలో పెళ్లి ఉంటే వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూస్తే ఇంటి తలుపులు, ఇంట్లో ఉన్న బీరువా తెరచి ఉన్నాయి. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం, మూడు కేజీల వెండి ఆభరణాలు చోరీ జరగడంతో ఆదోని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలూరులో..

శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు.



కోడుమూరులో విచారణ జరుపుతున్న పోలీసులు



ఆలూరులో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మెయిన్ బజార్‌లోని సునీత ఇంటి తాళాలు పగలగొట్టి రూ.9 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న వెంకటలక్ష్మి డ్రస్ సర్కిల్ షెటర్ తొలగించి చొరబడ్డారు. అందులో నగదు లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ముందు నివాసం ఉంటున్న బసి రెడ్డి ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. బసి రెడ్డి దంపతులు ఊరికి వెళ్లడంతో ఎంత నగదు, సొత్తు చేరి అయ్యిందో తెలియాల్సి ఉంది. క్లూసం టీంను వచ్చి వివరాలు సేకరించింది.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఫజుల్‌రెహ్మాన్

కర్నూలు (టౌన్): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ ఫజుల్ రెహ్మన్ అన్నారు. ఆదివారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా ప్రాంగణంలో రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అంతర్ డిగ్రీ కళాశాలల వాలీబాల్, చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వీసీ ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోటీల్లో వాలీబాల్ క్రీడాంశంలో 15 కళాశాలలు, చదరంగ పోటీల్లో 6 కళాశాలలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఐఎఎస్ఈ కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఆది నారాయణ రెడ్డి, విశ్వవిద్యాలయ సమన్వయ కర్త డాక్టర్ కె.వి. శివకిషోర్, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్‌యూ వీసీ

విజేతల వివరాలు

వాలీబాల్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో కర్నూలు శ్రీక్రిష్ణ సాయికళాశాల జట్టుపై 25–15 స్కోర్‌తో నంద్యాల ఎస్‌ఆర్ కళాశాల, ప్రజ్ఞా కళాశాల జట్టుపై 25–20 స్కోర్‌తో రాయలసీమ యూనివర్సిటీ జట్టు, నారాయణ డిగ్రీ కాలేజీపై 15–10 స్కోర్‌తో పత్తికొండ ప్రభుత్వ కాలేజీ జట్టు, శంకరాస్ కళాశాల జట్టుపై 15–06 స్కోర్‌తో ఎమ్మిగనూరు ఎస్‌ఎంఎల్‌జీ డిగ్రీ కళాశాల, శ్రీశైలం డిగ్రీ కళాశాలపై 25–16 స్కోర్‌తో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల జట్లు విజేతలుగా నిలిచి సెమీఫైనల్‌కు చేరాయి.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మద్దిలేటి



కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఇ.మద్దిలేటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని కర్నూలు ఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర సంఘం కార్యదర్శి కె.రమణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. తొమ్మిది పోస్టులకు ఎన్నికల ప్రకటన విడుదల చేయగా.. అన్ని పోస్టులకు ఏకగ్రీవంగానే ఎన్నికలు జరిగాయి. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న మద్దిలేటి జిల్లా 4వ తరగతి ఉద్యోగుల సంఘానికి మూడోసారి ఎన్నిక కావడం విశేషం. నూతన కార్యవర్గ సభ్యులను ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న అభినందించారు. నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడుగా మద్దిలేటి, అసోసియేట్ ప్రెసిడెంటుగా కె.ఫయాజ్ బాషా(జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసు), ఉపాధ్యక్షులుగా వి.లక్ష్మీనారాయణ(కర్నూలు ఏడీఏ ఆఫీసు), సి.వెంకటేశ్వర్లు (జిల్లా ట్రెజరీ ఆఫీసు), జిల్లా కార్యదర్శిగా సి.హెచ్. భాస్కరరెడ్డి(పే అండ్ అకౌంట్స్ ఆఫీసు), జాయింట్ సెక్రటరీలుగా ఎన్.రవిరాజు (జిల్లా పౌరసంబంధాల శాఖ ఆఫీసు), బి.రాముడు (పీడబ్ల్యూ డివిజన్ ఆఫీసు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.సుధాకర్(జిల్లా పట్టుపరిశ్రమ కార్యాలయం), కోశాధికారి డీఎండీ షబీర్ (కర్నూలు భూసంరక్షణ ఆఫీసు) ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియలో రాష్ట్ర అధ్యక్షుడు మల్లేషయాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో వైభవంగా జ్వాలాతోరణం



దేదీప్యమానంగా వెలుగుతున్న జ్వాలాతోరణం



కోటి దిపోత్సవంలో భక్తజనం

● కనులపండువగా కోటి దీపోత్సవం

మహానంది: మహానందిలో ఆదివారం రాత్రి జ్వాలాతోరణం,కోటి దీపోత్సవ కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి వేద పండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ప్రధాన అర్చకులు మామిపల్లె అర్జునశర్మ ఆధ్వర్యంలో మహానందీశ్వరుడికి విశేష పూజలు చేసి జ్వాలాతోరణం వెలిగించేందుకు అఖండ శివజ్యోతిని తీసుకుని వచ్చారు. తర్వాత గణపతి పూజ, లక్ష్మీపూజ, దీపపూజలు చేసి శాస్త్రోకంగా జ్వాలాతోరణం వెలిగించారు. అనంతరం కళారాధన మండపం ముందుభాగంలో వేలాది సంఖ్యలో భక్తులు కోటి దిపోత్సవంలో పాల్గొని పౌర్ణమి పూజలను నిర్వహించారు. పూజ కార్యక్రమాల్లో మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్‌తో పాటు ఆలయ ధర్మకర్తలు, సమీప గ్రామాల భక్తులు వేలాది సంఖ్యంలో పాల్గొన్నారు.

భోగేశ్వరుడికి కిరణాభిషేకం

గడివేముల: గడిగరేవుల సమీపంలోని దుర్గాభోగేశ్వర ఆలయంలో భోగేశ్వరుడికి కిరణాభిషేకం జరిగింది.ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి 6.50 గంటల వరకు దాదాపు ఇరవై నిమిషాల వరకు ఆది దేవునిపై సూర్య కిరణాలు ప్రసరించాయి. ఈ అరుదైన దృశ్యాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఏటా నవంబర్ నెలలో సూర్యకిరణాలు శివలింగాపై పడతాయని ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ తెలిపారు. కాగా ఒకే సమయంలో ఈశ్వరుడిని, సూర్యుడిని దర్శించుకునే భాగ్యం కలగడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.



భోగేశ్వరాలయంలో శివలింగాన్ని తాకిన సూర్య కిరణాలు

శ్రీమఠంలో 'కార్తీక' కాంతులు

● శ్రీమఠంలో వైభవంగా కార్తీక దీపోత్సవం



సభా వేదిక పై ప్రసంగిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: కార్తీక దీపాలతో శ్రీమఠం కాంతులీనింది. భక్త జనసందోహంతో కనువిందు చేసింది. ఆదివారం రాత్రి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో లక్ష దీపోత్సవం కనుల పండువగా జరిగింది. కర్ణాటక లోని బన్నంజె మఠం పీఠాధిపతి రాఘవేంద్ర తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. శ్రీమఠం పీఠాధిపతి వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జ్యోతిప్రజ్వలన గావించి లక్షదీపోత్సవానికి అంకురార్పణ పలికారు. శ్రీమఠం కారిడార్ ప్రాంగణంలో భక్తులు దీపాలను వెలిగించారు. లక్షదీప కాంతులతో శ్రీమఠం ప్రాంగణం భక్తులకు కనువిందు చేసింది. వేడుకలో తెలంగాణ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, మఠం మేనేజర్ శ్రీనివాస రావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహా మూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్,ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు పాల్గొన్నారు.

ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన టెక్నికల్ ఆఫీసర్లు, అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి. వీరయ్య (ఇరిగేషన్), ఎం లక్ష్మీనారాయణ (ఆర్‌డబ్ల్యూఎస్ , కోశాధికారిగా ఎం రమేష్ (ఇరిగేషన్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులుగా ఈ తులసీబాయి, కె. విశ్వనాథ్, ఎస్ నూర్ అహమ్మద్, ఎంసీ మద్దిలేటితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఈ కార్యవర్గం పదవీ కాలం 2026 వరకు ఉంటుందన్నారు. సమావేశంలో పీఆర్ జేఏసీ నాయకులు పి. దస్తగిరిబాబు, జిలానీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహబూబ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామ వివాహిత లలిత (27) ఆదివారం తన ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దేవనకొండ మండలం బేతపల్లెకు చెందిన లలితకు పుల్లగుమ్మికి చెందిన మార్కాపురం నారాయణరెడ్డికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంట్లో ఉరివేసుకుని మరణించిన లలితను గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుటుంబీకుల ఫిర్యాదు అనంతరం విచారణ చేపట్టనున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

నిర్లక్ష్యం వద్దు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే నిర్లక్ష్యం చేయరాదని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. ఆదివారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని చెప్పారు. నెలవారి బిల్లులు 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. చేరాలన్నారు.